రాంతరాలలో ఆరిపోని ఆశ—ఈ లోకంలో ఇంత పెద్ద ప్రపంచంలో, తన సాహచర్యం ఎవ్వరికి అక్కరలేదా అని- తన బ్రతుకు లోని ఈ బాధలు ఎవ్వరికీ అక్కరలేదా అని....

చెప్పింది పార్వతి—"అతను ఆ వూళ్ళోనే లెక్చరరు. కేరాఫ్ అని రాయి" అని.

సగం అనుమానంతోనే రాసింది శ్యామల. నాలుగు రోజు లయాక జవాబు....

గట్టిగా కళ్ళు మూసుకుంది శ్యామల అవన్నీ తలుచుకుని. 'భగవాన్!' అనుకున్నది.

కాలం ఇట్లానే గడుస్తోంది....శ్యామలకి అన్నీ వున్నాయి— ఏమీలేదు.

ఈ పరిస్థితిలోనించి ఒక్కసారి విముక్తి వొస్తుందని శ్యామల అనుకోలేదు—ఆమె అనుకున్నట్లు ఏమీ జరగలేదు ఎప్పుడూ—అనుకోనివి జరుగుతూనూ వున్నాయి.

ఆ సాయంత్రం హరి యింటికి రాగానే, "కృష్ణమూర్తి కి ఈ ఊళ్ళో ఉద్యోగం అయిందిట. ఇవాళ కనిపించాడు" అన్నాడు.

"వాళ్ళందరూ...." అన్నది శ్యామల.

"అతనూ, భార్య. పద్మ—అతని చెల్లెలు, నువ్వు చూస్తావుగా! రేపు వొస్తామన్నారు. నిన్ను చూడాలని వుందట!" అన్నాడు.

"నిజంగా!" అన్నది శ్యామల—సంతోషం ఆపుకోలేక.

తన బాధ అతనికి తెలుసును. "అవును శ్యామలా....నిజంగానే. వాళ్ళ యింటికి వెళ్ళివస్తున్నాను. అందరు మనుషులూ ఒక్కలాగ ఉండరుగా!" అన్నాడు హరి.

ఆ మర్నాడు శ్యామలకి తీరుబడి లేకపోయింది, యింట్లో అన్నీ రాకకి సిద్ధం చెయ్యడంతో. హోటలునించి స్వీట్స్ తెప్పించింది—యింట్లో ఫలహారాలూ కాఫీ తయారుచేసింది. యిల్లంతా పండగకి మల్లే అలంకరించింది,

ఆ సాయంత్రం అంతా తియ్యటి కలలాగ సాగిపోయింది

చెప్పింది శ్యామల-జరిగినదంతా. "వాళ్ళు నేనంటే అసహ్య పడుతున్నారు" అని ఏడ్చింది.

"పోనీ, శ్యామలా!....మనం వున్నాంగా!"

తేరుకుని లేచి కూర్చుంది శ్యామల-చుట్టూ ఇంటి నిశ్శబ్దం.... బయట వెన్నెల బాగా వొచ్చింది.

"మనం, పోదాం," అన్నది చివరికి.

ఈ బాధల చీకటిలో, నిష్క్రమణం ఒక్కటే వెలుతురులాగ కనిపించింది శ్యామలకి. ఆ వూరుకి దూరం ఇంకా ఎక్కువైతే బాగుండు ననిపించింది. ఎవ్వరూ లేనిచోటికి....ఎవ్వరికీ తాము తెలీని చోటుకి....

"అలాగే శ్యామలా....పోదాం!" అన్నాడు హరి.

కృతజ్ఞతతో బరువెక్కిన కళ్ళతో అతనివైపు చూసింది శ్యామల. అతను తనని ప్రేమించాడు....తనకి జీవితం ఇచ్చాడు.... తనకి అన్నీ ఇచ్చాడు....తన అన్నీ వొదులుకుని.

"ఎంత మంచివారు మీరు!" అన్నది శ్యామల మనసారా.... ఆ ఉద్రేకంలో ఆమె కంఠం గాద్గదికం అయిపోయి, కళ్ళు నీటితో నిండిపోయాయి.

ఆమె కళ్ళు నీటితో నిండిపోయాయి. చుట్టూ మసకవెల్తురు మాత్రమే వుంది. ఆమె మనసులో వివిధ భావాలు బలవత్తరంగా యుద్ధం చేస్తున్నాయి,

లేకపోతే హరి చెంపమీద తేరిన తట్లూ. అతని కళ్ళలోని భయమూ, అంతరాంతరాలలో అతను అనుభవిస్తోన్న అవమానమూ శ్యామలకి కనిపించి వుండేవి; వాటి కారణమూ ఆమెకి తెలిసి వుండేది.

కాని, ఆమె కళ్ళు నీటితో నిండిపోయాయి. మనసూ దుఃఖంతో నిండిపోయింది. అందుకనే ఆమె ఇవేవీ చూడలేక పోయింది.